
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం మధిర గ్రామానికి చెందిన జంగా రామ్‌భూపాల్ రెడ్డి, సుమప్రతిమలు రూ.లక్ష విరాళం అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 66,450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 64,450 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



క్రాకర్స్ షాపుల్లో తనిఖీలు

చిలకలూరిపేట టౌన్: దీపావళి క్రాకర్స్ షాపులలో గురువారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. యజమానుల వద్ద ఉన్న లైసెన్సులు, అనుమతి పత్రాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి పుష్పార్చన



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో గురువారం లోక కళ్యాణార్థం దాతల సహకారంతో అమరేశ్వర స్వామికి పుష్పార్చన నిర్వహించారు. తొలుత మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి స్వామి వారికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో రుత్విక్కులు పుష్పార్చన నిర్వహించారు. అనంతరం బాల చాముండికా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి బంగారు హారం బహూకరణ



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ దిగువ సన్నిధిలో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి బంగారు హారాన్ని బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ తెలిపారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారు పచ్చల హారాన్ని మంగళగిరి పట్టణానికి చెందిన నీలి నాగమల్లేశ్వర రావు, రత్నకుమారి దంపతులు గురువారం ఆలయ అధికారులు, అర్చకులకు అందజేశారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ పర్యటన



గుంటూరు రూరల్: వెంగళాయపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ వాటర్ షెడ్ ప్రోగ్రాం డిప్యూటీ కమిషనర్ సాగర్, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్‌లు గురువారం పర్యటించారు. గ్రామ పంచాయతీలో 21.38 ఎకరాల ఊర చెరువు ఉంది. వాటర్ షెడ్, అమృత్ సరోవర్ పథకాలలో భాగంగా చెరువుకు రివిట్‌మెంట్, వాకింగ్ ట్రాక్, ప్లాంటేషన్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రవి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శ్రీరామ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు రహిత చికిత్స అందించాలి



గుంటూరువెస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ ఉత్సవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ నెట్‌వర్క్ ఆసుపత్రుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సేవకు అంకితమైన ఉద్యోగుల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు యు.సుమిత్రా దేవి, సంయుక్త కార్యదర్శులు కోటా సాహెబ్, వి.కార్తీక్, కోశాధికారి శ్రీనివాస్, మహిళా విభాగం నాయకులు రమణి, మయూరి పాల్గొన్నారు.

నేతన్నకు ఉత్తుత్తి హామీ

- చేనేతకు అమలు కాని ఉచిత విద్యుత్
- కూటమి ప్రభుత్వంలో మూతపడుతున్న మగ్గాలు
- నాడు నేతన్నలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేలు చెల్లింపు

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ జీవో ఇచ్చి ఆరు నెలలు గడిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత, పవర్ లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 16 మాసాలు కావస్తున్నా విద్యుత్ బాదుడు కొనసాగుతూనే ఉంది. ఉచిత విద్యుత్‌తోపాటు ఎన్నికల హామీల అమలుకు నేతన్నలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సత్తెనపల్లిలో రెండు రోజులపాటు జరిగిన ఏపీ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలలో కార్యాచరణ రూపొందించుకున్నారు.

సత్తెనపల్లి: ఉచిత విద్యుత్ జీవోతో తమ కుటుంబాలకు కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుందనుకున్న చేనేతల జీవితాల్లో నిరాశే మిగిలింది. చేనేత, పవర్ లూమ్స్ ధ్వని వినిపించడం తగ్గిపోతుంది. ఇందుకు వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలే ప్రధాన కారణం. ఫలితంగా దాదాపు అన్ని చేనేత సహకార సంఘాలు, పవర్‌లూమ్ కేంద్రాలు మూతపడే పరిస్థితిలోకి వెళ్తున్నాయి. ఈ ఏడాది మార్చి 26వ తేదీన కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీవో నెంబర్ 44 నేటికీ అమలు కాకపోవడంతో చేనేతలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

నేతన్న నేస్తంతో ఆదుకున్న గత ప్రభుత్వం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జవసత్వాలు కల్పించి అండగా నిలిచారు. సొంత మగ్గం ఉన్న ప్రతి కార్మికుడి కుటుంబానికి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం అందించారు. విద్యుత్ చార్జీల నుంచి యూజర్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. జగనన్న ప్రభుత్వంలో చేనేత కుటుంబాల్లో వెలుగులు నిండాయి.

జీవో అమలులో నిర్లక్ష్యం

గతేడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో దిగివచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 26న జీవో 44ను విడుదల చేసింది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీవోలో స్పష్టం చేశారు. అయితే జీవో విడుదలై ఆరు నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో నేటికీ ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోలేదు.



సత్తెనపల్లిలోని ఫణిదం సొసైటీలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికులు



సత్తెనపల్లిలోని ఫణిదం చేనేత సొసైటీలో రాట్నం వడుకుతున్న మహిళా కార్మికులు

మూతబడుతున్న సహకార సంఘాలు



నేతన్న పరిస్థితి దుర్భరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 70 సహకార సంఘాలు మూత పడ్డాయి. మరో వైపు రాజమండ్రి సమీపంలోని అంగర సొసైటీకి రూ.3 కోట్లు ఆప్కో నుంచి రావాల్సి ఉంది. అవి విడుదల కాకపోవడంతో 10 రోజులుగా అక్కడ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుంది. ఉచిత విద్యుత్‌తోపాటు మగ్గం ఉన్న ప్రతి నేత కార్మికుడికి నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి తక్షణమే ఆదుకోవాలి. లేకుంటే ప్రత్యక్ష పోరాటానికి చేనేత కార్మికులు సిద్ధం కానున్నారు.

– కట్టా శివ దుర్గారావు, ఉపాధ్యక్షుడు, ఏపీ చేనేత కార్మిక సంఘం

వినుకొండలో ఐటీ తనిఖీలు

- మూడో రోజుకు చేరిన సోదాలు
- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం

వినుకొండ: వినుకొండ పట్టణంలోని పలు డాల్ మిల్లులు, కందిపప్పు వ్యాపారుల ఇళ్లపై ఆదాయపు పన్ను శాఖ అధికారుల తనిఖీలు గురువారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న సుమారు రూ.500 కోట్ల పప్పుల కుంభకోణం కేసులో భాగంగా ఈ సోదాలు కొనసాగుతున్నాయి. తొలి రెండు రోజులు సాధారణ బృందాలు తనిఖీలు నిర్వహించగా, మూడో రోజు గురువారం ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. పట్టణంలోని షణ్ముఖ సాయి డాల్‌మిల్లుతోపాటు ఏనుగుపాలెం రోడ్‌లో మరో మిల్లు, కొత్తపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బజార్లోని వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు.

ఈ తనిఖీలలో భాగంగా పట్టణానికి చెందిన ఒక అపరాల ట్రేడర్ (పప్పుల వ్యాపారి)ని అధికారులు విచారణ నిమిత్తం పిలిపించారు. అతడి వ్యాపార లావాదేవీలు, ఖాతా పుస్తకాలపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

నలుగురు వ్యాపారులపై అనుమానం

వినుకొండకు చెందిన నలుగురు వ్యాపారులు ఈ కుంభకోణంలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగాను పాల్గొన్నట్లు ఐటీ వర్గాలు అనుమానిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకంలో భారీ స్కామ్ ఆరోపణలు ఈ మొత్తం వ్యవహారం కేంద్ర ప్రభుత్వ 'భారత్ దాల్' పథకానికి సంబంధించినదిగా తేలింది. పేదలకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పప్పులను అందించే ఈ పథకంలో సుమారు రూ.2000 కోట్ల టెండర్లలో రూ.500 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కుంభకోణం తీరు

పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వ్యాపారులకు శనగలు సరఫరా చేసింది. వాటిని మిల్లింగ్ చేసి పచ్చిపప్పుగా మార్చి ప్రభుత్వానికి తిరిగి సరఫరా చేయాలి. అయితే, పలువురు వ్యాపారులు శనగలను నేరుగా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించి, పచ్చి పప్పును ప్రభుత్వానికి సరఫరా చేయకుండా కాగితాలపై లెక్కలు చూపించి వందల కోట్లు స్వాహా చేశారని ఐటీ అధికారులు భావిస్తున్నారు.

ప్రాంతాల వారీగా సోదాలు:

హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కర్నూలుతో పాటు పప్పు మిల్లుల కేంద్రమైన వినుకొండలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

అధికారుల పాత్రపై తీవ్ర ఆరోపణలు

ఈ భారీ స్కామ్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని పెద్ద అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు డాల్ మిల్లుల వ్యాపారులు తమకు సహకరించిన అధికారులకు మిల్లుల్లో రహస్యంగా ఆతిథ్యం ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీ అధికారులు ఈ ఆరోపణలపై దృష్టి సారించి, కీలకమైన డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ లావాదేవీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో వినుకొండతోపాటు తెలుగు రాష్ట్రాల వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. సోదాల పూర్తి వివరాలు, స్వాధీనం చేసుకున్న ఆస్తులు, ఎగవేసిన పన్నుల వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.



ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్న మిల్లు

హుండీ ఆదాయం రూ. 50 లక్షలు

దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు గురువారం లెక్కించగా రూ. 50,17,019 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిశేషనాయుడు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ జగన్నాథ స్వామి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి టి.సుభద్ర ఆధ్వర్యంలో 82 రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షకు కలెక్టర్ హాజరు

నరసరావుపేట: ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం వీడియా కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షకు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, మందుల పంపిణీ, ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగ నిర్ధారణ సేవలు, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ ప్రగతి, ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న వాహనాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా నిర్వహించిన సమీక్షలో 22ఏ కింద ఉన్న భూముల కేటాయింపు, హక్కుల గుర్తింపు, పత్రాల పరిశీలన, భూ వివాదాల పరిష్కారం అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ సూరజ్

పెదకూరపాడు వద్ద రైలు ప్రమాదం



రైలు రూఫ్ టాప్ నుంచి ప్రయాణికులను కాపాడుతున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది



ప్రయాణికులను స్ట్రెచర్‌లో తరలిస్తున్న రైల్వే సిబ్బంది

- ప్రయాణికులను కాపాడిన సిబ్బంది
- 108 వాహనంలో క్షతగాత్రుల తరలింపు
- మాక్ డ్రిల్‌లో భాగంగా నిర్వహణ
- పర్యవేక్షించిన డీఆర్‌ఎం, ఇతర అధికారులు

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ప్రమాదం జరిగింది. బోగీలు దెబ్బతిన్నాయి. బోగీల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులు ఆర్తనాదాలు చేస్తున్నారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక సిబ్బంది వారిని కాపాడే చర్యలు చేపట్టారు. అత్యాధునిక పరికరాలతో బోగీలను కట్ చేసి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఇదంతా నిజమే అనుకుంటే పొరపాటు పడినట్లే..మాక్ డ్రిల్‌లో భాగంగా గురువారం నిర్వహించారు. రైలు ప్రమాదాల సమయంలో ప్రయాణికులను సురక్షితంగా కాపాడి, ప్రాణ నష్టాన్ని నివారించే విషయంపై గుంటూరు రైల్వే డివిజన్‌లోని ఎన్డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్, రైల్వే బ్రేక్ డౌన్, స్టేట్ గవర్నమెంట్ ఫైర్, స్టేట్ గవర్నమెంట్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఆధ్వర్యంలో గురువారం పెదకూరపాడు రైల్వేస్టేషన్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. గుంటూరు డీఆర్‌ఎం సుథేష్ణ సేన్, సీనియర్ డివిజన్ సేఫ్టీ అధికారి విజయకీర్తి, మెకానికల్ చీఫ్ ఇంజినీర్ రవికిరణ్, ఫైర్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు, సీనియర్ డివిజన్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ రత్నాకర్, సేఫ్టీ చీఫ్ అధికారి కిషోర్, సీఆర్‌ఎస్‌ఈ కమల్‌కాంత్ పర్యవేక్షించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా రెండు రైల్వే కోచ్‌లు పట్టాలు తప్పి ప్రమాదానికి గురికాగా అందులోని ప్రయాణికులు రక్తపు గాయాల మధ్య ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం ఉండేలా నెలకొల్పారు. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకున్న బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. బోగీలలో ఇరుక్కుపోయిన ప్రయాణికులను సురక్షితంగా రక్షించేందుకు అత్యాధునిక టూల్స్ ఉపయోగించారు. బోగీల కిటికీలు, రూఫ్‌లు కట్ చేసి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తాత్కాలికంగా ఏర్పాటుచేసిన టెంట్లలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.



మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సుథేష్ణ సేన్, సీనియర్ డీఎస్‌వో విజయకీర్తి

సిబ్బందిని సంసిద్ధం చేసే నిరంతర చర్య

డీఆర్‌ఎం సుథేష్ణ సేన్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ఏ సమయంలో అయినా సిబ్బందిని సంసిద్ధత చేసే నిరంతర చర్య మాక్ డ్రిల్ అన్నారు. మాక్ డ్రిల్ ద్వారా రియల్ టైమ్‌లో సిబ్బంది పనితీరు ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రాణ నష్టం నివారించే లక్ష్యంగా ఇటువంటి మాక్ డ్రిల్స్ ఉపయోగపడుతాయన్నారు. సిబ్బంది సమన్వయాన్ని మెరుగుపరుస్తుదన్నారు.

–డీఆర్‌ఎం సుథేష్ణ సేన్

కూటమి కుట్రలపై విధేయతదే విజయం!

యుద్ధంలో నెగ్గాలంటే ఎవరికైనా ఒక్కటే మార్గం.. వీరోచిత పోరాటమే శరణ్యం. అదే ధర్మయుద్ధం. అది చేతకాని వారికి వెన్నుపోటు, వంచనలే ఆయుధాలు అవుతాయి. ఇక ప్రజాస్వామ్యంలో ప్రజలు మెచ్చి ఇచ్చిన పదవులే పెద్ద విజయం. మండల ప్రజాపరిషత్ ఎన్నికల సంగ్రామంలో వైఎస్సార్‌సీపీ సువర్ణ పరిపాలనకు బహుమతిగా నాలుగేళ్ల క్రితం ప్రజలు ఆ పార్టీ నేతలకు బ్రహ్మరథం పట్టారు. తెలుగుదేశం పార్టీకి మచ్చుకైనా మెజార్టీ రాలేదు. ఇలా గుంటూరు జిల్లా పెదకాకాని, పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలాల్లో ఎంపీపీ పదవులు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ముప్పాళ్లలో టీడీపీకి కనీసం ఒక్క సభ్యుడూ లేరు. కానీ, అధికారం అండగా కూటమి ప్రభుత్వం తన కండకావరాన్ని ఇప్పుడు చూపుతోంది. ఎంపీపీ పదవిని కైవసం చేసుకోవడానికి ప్రలోభాలు, బెదిరింపుల పర్వానికి తెరలేపింది. కానీ వైఎస్సార్‌సీపీకి వీరవిధేయులైన ఎంపీటీసీ సభ్యుల తెగువ ముందు అవేవీ పనిచేయడం లేదు. వారిని ఆర్థికంగా దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్న పచ్చ పార్టీ నేతలకు పట్టపగలే చుక్కలు కనిపించేలా ధైర్యంగా సమాధానం ఇస్తున్నారు. దీంతో రెండు చోట్లా కంగుతినడం తమ్ముళ్ల వంతవుతోంది. అవిశ్వాసం, వెన్నుపోట్లకు మారుపేరైన చంద్రబాబు పార్టీపై వైఎస్సార్‌సీపీ సభ్యుల 'విధేయత'దే విజయం అయింది.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం

- పావులు కదుపుతున్న తమ్ముళ్లు
- ఇప్పటికే ఫోన్ ద్వారా సంప్రదింపులు
- పార్టీ మారేదిలేదని తేల్చి చెప్పిన ఎంపీటీసీ సభ్యులు



పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం

పెదకాకాని: ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తెలుగు తమ్ముళ్లు ఆ దిశగా పావులు కదుపుతున్నారు. మండలంలోని పలువురు ఎంపీటీసీలకు ఫోన్‌లు చేసి నయానా, భయానా చర్చలు జరిపే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పార్టీలు మారి పరువు పోగొట్టుకోవడానికి తాము సిద్ధంగా లేమని పలువురు ఎంపీటీసీ సభ్యులు స్పష్టంచేసినట్లు చెబుతున్నారు. పెదకాకాని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడుగా అనుమర్లపూడి ఎంపీటీసీ సభ్యుడిని ఎన్నుకొని నాలుగేళ్లు పూర్తయ్యింది. నాలుగేళ్ల వరకూ ఎంపీపీ కుర్చీపై అవిశ్వాసం పెట్టడానికి అవకాశం లేదనే నిబంధనలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినప్పటికీ నాలుగేళ్లు పూర్తయ్యే వరకూ వేచి ఉన్నారు. గత నెల సెప్టెంబరుతో నాలుగేళ్లు పూర్తి కావడంతో ఎంపీపీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెదకాకాని మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలు, ఒక హామ్లెట్ విలేజ్ ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న ఓటర్ల ఆధారంగా మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారిలో వైఎస్సార్ సీపీ చెందిన 15 మంది ఎంపీటీసీ సభ్యులు, ఆరుగురు టీడీపీ చెందిన ఎంపీటీసీలు గెలుపొందారు. మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు ఉన్న వైఎస్సార్ సీపీ నుంచి అనుమర్లపూడి ఎంపీటీసీ సభ్యుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావును ఎంపీపీగా ఎన్నుకున్నారు. తమ్ముళ్లు రాయబారాలు నడుపుతున్నప్పటికీ పార్టీ మారడానికి, ఎంపీపీకి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంలో పాల్గొనడానికి పలువురు ఎంపీటీసీ సభ్యులు ససేమిరా అంటున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి వారి మద్దతుతో విజయం సాధించి పదవీకాలం పది నెలలు ముందు తాము పార్టీ మారడానికి, చేతులెత్తడానికి సిద్ధంగా లేమని చెబుతున్నారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ మారిన వారిని కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుని ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదనే చర్చ కూడా సాగుతోంది.

ముప్పాళ్ల ఎంపీపీ పీఠంపై గురి

- బలం లేకున్నా టీడీపీ బరితెగింపు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై వేధింపుల పర్వం
- అవిశ్వాసం అంటూ డ్రామా



ముప్పాళ్ల ఎంపీడీవో కార్యాలయం

ముప్పాళ్ల: ముప్పాళ్ల మండల పరిషత్ అధ్యక్ష పీఠంపై టీడీపీ నాయకులు గురి పెట్టారు. 2021లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు పదకొండు స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందారు. జనసేన ఒక స్థానంలో గెలుపొందింది. టీడీపీ ఒక్కచోట కూడా గెలిచిన దాఖలాలు లేవు. మాదల ఎంపీటీసీ సభ్యుడు మృతి చెందగా ప్రస్తుతం ఆ స్థానం ఖాళీగా ఉంది. భయపెడుతూ, ప్రలోభాలకు గురిచేస్తూ, పదవి ఆశ చూపుతూ ఆరుగురు ఎంపీటీసీలను టీడీపీ వైపునకు లాక్కున్నారు. ఎంపీపీతో కలిపి నలుగురు ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీని వీడేందుకు ఇష్ట పడకపోవటంతో వారిపైన, వారికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను దెబ్బకొట్టేలా అధికార దర్పాన్ని ఉపయోగించుకుంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

కొత్తగా తెరపైకి అవిశ్వాసం డ్రామా

కొత్తగా ఎంపీపీపై అవిశ్వాస డ్రామాను టీడీపీ నాయకులు తెర లేపారు. చాగంటివారిపాలెంకు చెందిన ఎంపీపీ మారూరి పద్మపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు సమావేశం నిర్వహించాలంటూ సత్తెనపల్లి ఆర్డీఓను మంగళవారం కలసి వినతిపత్రం అందించారు. అవిశ్వాస తీర్మానం ఇవ్వాలంటే కనీసం 8 మంది ఎంపీటీసీ సభ్యుల బలం ఉండాలి. ఎనిమిది మంది సభ్యులు ఆర్డీవో ఎదుట హాజరై అవిశ్వాస తీర్మానం కోరుతూ వినతి పత్రం అందించాల్సి ఉంటుంది. కేవలం ఐదుగురు సభ్యులతో సంతకాలు చేయించి అవిశ్వాస తీర్మానం అంటూ డ్రామా చేస్తున్నారు. ఈ విషయం పై వైఎస్సార్‌సీపీ సభ్యులు మాత్రం పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని ఖరాఖండిగా తేల్చి చెబుతున్నారు.

పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉన్నాం.

–మలిరెడ్డి అనూష, లంకెలకూరపాడు ఎంపీటీసీ

సోషల్‌మీడియాలో టీడీపీ నాయకులు చేస్తున్న విష ప్రచారంలో వాస్తవం లేదు. అవిశ్వాస తీర్మానంపై ఆర్డీఓకు ఇచ్చిన పేపర్లలో తన సంతకాన్ని ఫోర్జరీ చేశారు. వైఎస్సార్ సీపీ నిర్ణయానికే కట్టుబడి ఉంటాం. కేసులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదు.

క్లుప్తంగా

నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు


హనుమంతరావు (ఫైల్)

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో సూరాబత్తుని హనుమంతరావు (58) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంగీకారంతో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు నేత్రదానం చేసినట్లు జిల్లా జనవిజ్ఞాన వేదిక జనరల్ సెక్రటరీ సంద్రపాటి చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమంతరావు కార్నియాను ఇద్దరు అంధులకు అమర్చి కంటిచూపు వచ్చేలా చేస్తారన్నారు. మరణానంతరం ఎవరైనా పది గంటలలోపు నేత్రాలను దానం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో శంకర వైద్య నిపుణులు, కుటుంబ సభ్యులు సూరాబత్తుని హైమావతి, కోటేశ్వరరావు, బొల్లా రామకృష్ణ, ఏడుకొండలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

- చోరీ చేసిన సొత్తుతో దంపతుల జల్సాలు
- పదమూడు కేసులు నమోదైనా.. ఏమీ తెలియనట్టు గ్రామంలో మకాం
- చోరీలకు పాల్పడే భర్త, భార్య అరెస్ట్

నగరంపాలెం: పగలు పల్సర్ బైక్‌పై తిరుగుతూ తాళాలు వేసి ఇళ్లను గుర్తించి, రాత్రిళ్లు చోరీలకు పాల్పడే భార్యాభర్తలను కొల్లిపర పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. దంపతుల నుంచి 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.2.15 లక్షలు, ఒక మోటారు సైకిల్, టీవీ, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం ఆయన మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. ఇటీవల కొల్లిపర మండల పరిధిలోని తాళాలు వేసి ఇళ్లల్లో వరుసగా చోరీలు జరిగాయి. తూములూరు గ్రామ వాసి మాటూరి మధుసూదనరావు గతనెల 28న ఊరెళ్లారు. ఈనెల 2న ఇంటికి రాగా, బీరువాలో దాచిన బంగారు సొత్తు చోరీ చేశారు. దీనిపై బాధితులు కొల్లిపర పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీ బి.జనార్ధనరావు, రూరల్ సీఐ ఆర్.ఉమేష్ నేతృత్వంలో కొల్లిపర పీఎస్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో కొల్లిపర గ్రామ వాసి కటారి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం రుజువైంది. గతంలోనూ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 13 చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ చోరీల్లో కొంత వరకు భార్య తేజ నాగమణికి ఇచ్చి భద్రపరిచేవాడు. దీంతో భార్యాభర్తలను అరెస్ట్ చేసి, 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.2.15 లక్షలు, పల్సర్ బైక్, ఒక టీవీ, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నారు.

చినుకు పడితే చప్టాల వద్ద కష్టాలే!

- నియోజకవర్గంలో 20కి పైగా లో లెవల్ చప్టాలు
- చిన్నపాటి వర్షాలకు సైతం ప్రమాదకరంగా ప్రవాహం
- రద్దీ మార్గాలు కావడంతో భారీగా నిలిచిపోతున్న వాహనాలు

పెదకూరపాడు: లో లెవెల్ చప్టాలు చినుకుపడితే చాలు తమ ప్రతాపం చూపుతున్నాయి. చిన్నపాటి వర్షాలకు సైతం ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మరికొన్ని చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి– సత్తెనపల్లి రహదారి లో లెవెల్ చప్టాలు చిన్నపాటి వర్షాలకు పొంగిపోర్లుతున్నాయి. నిత్యం రహదారి రద్దీగా ఉంటుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.


వర్షాలకు పెదకూరపాడులోని పేరమ్మ వాగు పొంగి లో లెవెల్ చప్టాపై పారుతున్న వర్షపు నీరు

ఈ ప్రాంతాల్లోనే...

- కాలచక్ర రహదారిపై సత్తెనపల్లి మండలం నందిగామ, పెద్దమక్కెన, గుడిపూడి, పెదకూరపాడు పేరమ్మ వాగు, నీరు కుంట, 75 త్యాళ్ళూరు లో లెవెల్ చప్టా, పరస వద్ద చప్టా, బలుసుపాడు – లింగాపురం చప్టా, కాశిపాడు వెళ్లే రహదారిలో లో లెవెల్ చప్టా ఉన్నాయి. ఈ చప్టాలు పొంగినప్పుడు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్ల తరబడి సమస్య ఉంది. ఈ చప్టాలను హైలెవెల్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- పెదకూరపాడు మండలంలోని కంభంపాడు లో లెవెల్ చప్టాలు, కంభంపాడు – జలాల్‌పురం మధ్యలో చప్టాలు పది అడుగుల మేరకు ప్రవహించడంతో ఈ దారిలో ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఈ చప్టాల కింద వందల ఎకరాలు ప్రతి ఏడాది నీట మునుగుతున్నాయి.
- పెదకూరపాడు-పాటిబండ్ల మధ్య రెండు లో లెవెల్ చప్టాలు ఉన్నాయి. వర్షాలకు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- అమరావతి మండలం పెద్ద మద్దూరు వద్ద బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే చాలు బ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం పెరగడంతో అమరావతి– విజయవాడ, అమరావతి – మంగళగిరికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- క్రోసూరు మండలంలోని ఉంటుకూరు వద్ద ఎద్దు వాగుపై బ్రిడ్జి నిర్మించినా వరద పక్కన నుంచి ప్రవహించి ఊటుకూరులోని లోవెల్ చప్టాపై పొంగి పొర్లుతోంది. దీంతో క్రోసూరు– అమరావతి, అమరావతి– అచ్చంపేటల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వాగు పొంగడంతో పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం కలుగుతోంది.


కంభంపాడు వద్ద లోవెల్ చప్టాపై పారుతున్న వర్షపునీరు


పాటిబండ్ల వద్ద వాగు పొంగి రోడ్డుపై నీరు ఉన్న దృశ్యం


పెదకూరపాడు నీరు కుంట వద్ద పొంగుతున్న వాగు

కార్యాలయం దాటని పాస్‌పుస్తకాలు

- అన్నదాతలకు తప్పని ఎదురు చూపులు
- రెండు నెలలుగా కార్యాలయాల్లోనే పుస్తకాలు
- రుణాలు, ఎరువుల కోసం రైతులకు తప్పని అగచాట్లు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన రైతు సుబ్బారావు ఇటీవల రైతు సేవా కేంద్రానికి ఎరువుల కోసం వెళ్లారు. ఆయనకు రీసర్వే జరిగిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వలేదు. కానీ పట్టాదారు పాస్ పుస్తకం ఉంటేనే యూరియా ఇస్తామని సిబ్బంది చెప్పారు. దీంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. ప్రస్తుతం రైతులకు పంట రుణాలు ఎంతో అవసరం. బ్యాంక్‌కు వెళ్లితే పాస్‌పుస్తకాలు లేకపోవడంతో రుణాలు ఇవ్వలేదు. తహసీల్దార్ కార్యాలయాలకు ఈ పుస్తకాలు వచ్చి రెండు నెలలు గడిచినా గడప మాత్రం దాటలేదు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ చేస్తారని రెవెన్యూ సిబ్బంది అంటున్నారు. ఆగస్టు 15వ తేదీన పంపిణీ చేస్తారని చెబుతుండటంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.

97,027 పుస్తకాలు ఇవ్వాలి...

పల్నాడు జిల్లాలో మొత్తం 97,037 కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు రాజముద్రతో తహసీల్దార్ కార్యాలయాలకు చేరాయి. నర్సరావుపేట రెవెన్యూ డివిజన్‌లోని 10 మండలాల్లో 83,201, సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని 4 మండలాల్లో 9,465, గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6 మండలాల్లో 4,361 పాస్‌పుస్తకాలు రైతులకు అందాల్సి ఉంది.


కార్యాలయంలో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలు

అన్నింటికీ కీలకం...

రుణమాఫీ, రైతు బంధు, అన్నదాతా సుఖీభవ, పంట రుణాలు, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్ర పరికరాలు, పాడిపశువులు, ఉద్యాన పంటలకు ఉపయోగించే సామగ్రిపై రాయితీకి పట్టాదారు పాస్ పుస్తకమే ప్రామాణికం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పుస్తకాలు రాకపోవడంతో ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన పథకాల కింద లబ్ధిని రైతులు కోల్పోవాల్సి వచ్చింది. సకాలంలో పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

తెనాలి: స్థానిక ఆంధ్రాప్యారిస్ బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన 'రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక' జరగనుంది. బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుంది. స్థానిక రామలింగేశ్వరపేటలోని మూల్పూరు సుబ్రహ్మణ్య కల్యాణ మండపంలో గురువారం విలేకరుల సమావేశంలో కేంద్రం పాలకవర్గ అధ్యక్షుడు టి.దక్షిణామూర్తి సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ఉచిత భోజన సౌకర్యంతోపాటు సమాచార బుక్‌లెట్ ఇస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్వీ సత్య కుమార్, సంయుక్త కార్యదర్శి పింగళి వేణుధర్, గౌరవాధ్యక్షుడు పీఎల్‌జీఎస్ ప్రకాశరావు, కోశాధికారి ఆర్.రాజేంద్రప్రసాద్, గౌరవ సలహాదారు బీఎల్ సత్యనారాయణమూర్తి, సభ్యులు డీవీ సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

తరగతి గది నుంచి పొలం వద్దకు..

క్షేత్రస్థాయిలో 'రావే'
విద్యార్థుల అనుభవాత్మక శిక్షణ

యద్లపాడు: పట్టణాల పరిధి దాటి, పల్లె బాట పట్టిన ఆ యువ సైన్యం... పుస్తకాల్లో చదివిన జ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో నేర్చుకుంటోంది. వారే ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బాపట్ల కళాశాల బీఎస్సీ అగ్రికల్చరల్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్(రావే) ప్రోగ్రాంలో భాగంగా వీరు మండల కేంద్రమైన యద్లపాడు, జగ్గాపురం, చాగంటివారిపాలెం, పమిడిపాడు, నార్నెపాడు గ్రామాలకు సెప్టెంబర్ 17న 31 మంది వచ్చారు. వీరిని ఆచార్య ఎన్‌జీరంగా యూనివర్సిటీ వ్యవసాయ విస్తరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఉష, జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నగేష్, విస్తరణ అధికారి డాక్టర్ సత్యగోపాల్ పర్యవేక్షిస్తున్నారు. స్థానిక అభ్యుదయ రైతులు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలక మండలి విశ్రాంత సభ్యులు పోపూరి శివరామకృష్ణ, జాగర్లమూడి రామారావులతోపాటు మరో పది మంది శిక్షణ ఇస్తున్నారు. పుస్తకాల్లోని జ్ఞానాన్ని క్షేత్రస్థాయి వాస్తవాలతో వారు సరిచూసుకుంటున్నారు. రైతులే గురువులుగా, వారి జీవితానుభవాలనే పాఠాలుగా మలుచుకుంటున్నారు. నూతన వంగడాలు, ఆధునిక సాగు పద్ధతులను స్థానిక రైతులకు వివరిస్తూ, వారిలో వ్యవసాయంపై మరింత అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ పద్ధతులను, భూసారం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వారు ఎదుర్కొంటున్న సవాళ్లను స్వయంగా తెలుసుకుంటున్నారు. పంట సాగుపై సందేహాలను నివృత్తి చేస్తూ, నేర్పుతూ–నేర్చుకుంటూ తమ వ్యవసాయ జ్ఞానాన్ని ద్విగుణీకృతం చేసుకుంటున్నారు. తమ మూడేళ్ల కళాశాల జీవితం.. అలాగే మూడు నెలల గ్రామ వాసం వెరసి రేపటి వ్యవసాయ రంగానికి పటిష్టమైన పునాది కానుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక విధానాలపై రైతుల అనాసక్తి, పెట్టుబడి భారం పెరగడం, కౌలు వ్యవస్థతో సవాళ్లు, సాగుపై యువత అనాసక్తి చూపడం, రసాయనాల వినియోగం పెరగడం, సేంద్రియ పద్ధతులపై అపోహలు, రైతులకు ఆర్థిక భరోసా, సాంకేతిక శిక్షణ వంటి అంశాలపై వారు దృష్టి సారించారు.


వరి నాట్లు వేస్తున్న విద్యార్థినులు


శిక్షణ ఇస్తున్న ఏవో హరిప్రసాద్, అభ్యుదయ రైతు శివరామకృష్ణ

నేటి నుంచి బోధనకు మాత్రమే పరిమితం

ఫ్యాప్టో నిర్ణయం

అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపుమేరకు శుక్రవారం నుంచి విద్యార్థులకు పాఠాలు మాత్రమే చెబుతామని, బోధనేతర పనులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు గురువారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి జె.ఎస్.ఎస్. ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ.. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనాసమయం హరించుకుపోతోందన్నారు. ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయేలా ఈ కార్యక్రమాలు పెరిగాయన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదన్నారు. అందుకే 10వ తేదీ నుంచి బోధనకే పరిమితం కానున్నామని, నాణ్యమైన విద్యను అందించాలని ఫ్యాప్టో నిర్ణయించిందన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపట్టనున్నారని చెప్పారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ చూస్తామన్నారు. మిగతా బోధనేతర పనులను నిలిపి వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు కట్ట నరసింహారావు, ఎస్.ఐజాక్, దాసరి మరియదాసు, కృష్ణ కిషోర్, మంటి సాంబశివరావు, జాన్‌సైదా ఫైజుల్లా, సీహెచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరించనున్నట్టు ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.మోహనరావు తెలిపారు. విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల పోరుబాటలో తీసుకున్న నిర్ణయం మేరకు వీటిని బహిష్కరిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శుక్రవారం నుంచి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మినహా ఇతర బోధనేతర పనులకు సంబంధించి యాప్‌లను బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతూ, బోధనపై దృష్టి పెట్టలేక పోతున్నారని తెలిపారు. పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు ఉస్మాన్, చంద్రజిత్‌యాదవ్, కె.శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, ఈ.ఏమండీ, పి.వి.భీష్మారావు తదితరులు పాల్గొన్నారు.


డీఈఓ చంద్రకళకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు


ఎంఈఓ గణేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు


క్రోసూరు: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరించనున్నట్లు మండలంలోని ఫ్యాప్టో సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి ఎం.గణేష్‌కు వినతిపత్రం అందచేశారు. వినతి అందచేసిన వారిలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు. ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

మానసిక కల్లోలం.. అందుబాటులో ఔషధం

- ప్రతి ఏడాది పెరుగుతున్న మానసిక సమస్యలు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

కరోనా వల్ల పెరిగిన మానసిక సమస్యల బాధితులను దృష్టిలో పెట్టుకుని మానసిక ఆరోగ్యానికి , వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మానసిక సమస్యలపై అవగాహన కల్పించి ప్రజలు ఇబ్బంది పడకుండా చేసేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

సత్తెనపల్లి: జిల్లాలో 20 ఏళ్ల క్రితం ఒకరిద్దరు మాత్రమే మానసిక వ్యాధి చికిత్స నిపుణులు ఉండే వారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో ప్రభుత్వ వైద్యశాలలో ఇరువురు ఉంటే ప్రైవేట్‌గా సుమారు 10 మందికిపైగా సైకియాట్రిస్టులు ఉన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఏరియా వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి రోజూ 20 నుంచి 25 మంది రోగులు వస్తున్నారు. అందులో 15 మంది కొత్తవారు ఉంటున్నారు. ఇక ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం సగటున రోజూ 10 నుంచి 20 మంది వరకు చికిత్స కోసం వెళ్తున్నారు. సమాజంలో తీవ్రమైన మానసిక సమస్యలు (స్కిజోఫియా, మానియా, డిప్రెషన్ అతిగా మద్యపానం, మత్తు పదార్థాలు సేవించడం) వారు 3 శాతం , ఇతర మానసిక వ్యాధులు ఉన్నవారు 5 నుంచి 10 శాతం వరకు ఉంటారని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు గుర్తించి వెంటనే మానసిక వైద్యులను సంప్రదిస్తే రోగికి కౌన్సెలింగ్, మందుల ద్వారా నయం చేయవచ్చని వారు సూచిస్తున్నారు.



ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పోస్టర్

మానసిక వ్యాధి లక్షణాలు..

ఆందోళన, భయం, గుండెదడ, అధిక చెమట, కాళ్లు, చేతులు వణకడం, అనవసర ఆలోచనలు, చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయడం, విచారం, పనిలో ఉత్సాహం లేకపోవడం, ఆకలి, నిద్ర లేకపోవడం, ఆత్మహత్య ఆలోచనలు, మతిమరుపు, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పు, తనలో తానే నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, ఇతరులను అనుమానించడం, అతి ఆనందం, అతి కోపం, ముసలితనంలో వచ్చే సమస్యలు, కలత నిద్ర, నిద్ర పట్టకపోవడం, నిద్రలో నడవటం, మాట్లాడటం, మూత్ర విసర్జన చేయడం, భయంకర కలవరింతలు, నిగ్రహశక్తి కోల్పోవడం వంటివి ప్రధాన లక్షణాలు.


మానసిక వ్యాధులకు కారణాలు ...

- శారీరక, జన్యుపర, వంశానుగత అంశాలు
- పెరిగిన వాతావరణం, కుటుంబ పరిస్థితులు, చెడు స్నేహాలు
- తలకు బలమైన గాయాలు కావడం, నాడీ వ్యవస్థలో తలెత్తే లోపాలు

మానసిక ఒత్తిడి వల్లే అనారోగ్యం....

మానసిక ఒత్తిడి వల్ల కడుపులో గ్యాస్ (వాయువు), ఆవేశాకావేశాల వల్లే అధిక రక్తపోటు, అతిబద్ధకం వల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగడం, స్వార్థం, మొండితనం వల్ల డయాబెటిస్ (మధుమేహం), అతి విచారం వల్ల ఆస్తమా, ప్రశాంతత లోపించడం వల్లే గుండె కొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయని ఇటీవల వైద్యులు గుర్తించారు. శరీరంలో వచ్చే సర్వరోగాలకు మూల కారణాలు తరచి చూస్తే ఆహార అలవాట్లతో పాటు అధిక శాతం జీవనశైలి సంబంధమైనవేనని తెలుస్తోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి....



మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆందోళనకు గురిచేసే విషయాలను పట్టించుకోకూడదు. మద్యం, పొగతాగటం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. కంటికి సరిపడా ఆరు నుంచి తొమ్మిది గంటలపాటు నిద్రపోవాలి. కుటుంబ సభ్యులందరితో కలిసి కొంత సమయాన్ని గడపాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. మానసిక వ్యాధులకు మందులు ఉన్నాయి.

– డాక్టర్ వడ్లాది వెంకటకిరణ్, మానసిక వ్యాధి నిపుణుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు

మా ఆత్మగౌరవాన్ని కాపాడండి...


నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

పిడుగురాళ్ల: తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని సచివాలయ ఉద్యోగులు మొర పెట్టుకుంటున్నారు. సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పుతూ తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని వాపోతున్నారు. వీటితోపాటు తమ ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చర్చలకు పిలవకపోతే ఈ నెల 19న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లను తొలగించటంతో ఆ విధుల భారాన్ని తమపై మోపారన్నారు. జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ

సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. ఇప్పటికీ ఏ శాఖలో పని చేస్తున్నామో అర్థం కావటం లేదు. రేషనలైజేషన్ ప్రక్రియతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు.

– నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్

మహిళలకు గౌరవం లేదు

సచివాలయాల్లో పని చేస్తున్న మహిళలకు గౌరవం లేకుండాపోతోంది. శానిటరీ సెక్షన్‌లో పనిచేసే సచివాలయ ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకు రోడ్లపై విధులు కేటాయిస్తున్నారు. కార్యాలయాల్లో వసతులు కూడా లేవు.

– దీప్తి, మహిళా పోలీస్

పశు సంతతిని పెంచుకోవాలి

ప్రత్తిపాడు: గ్రామాల్లో రోజురోజుకీ తగ్గిపోతున్న పశుసంతతిని పెంచుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వి.వి. సత్యనారాయణ అన్నారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో గురువారం ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేలుజాతి లేగ దూడల ప్రదర్శనను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన ప్రత్తిపాడు ఏడీ సుగణ్య రావు, ఇతర అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడలకు సరైన పోషకాహారం అందించాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పశు సంతతిని జాగ్రత్తగా కాపాడుకోవచ్చన్నారు. లింగ నిర్ధారిత వీర్యం వలన బహుళ ప్రయోజనాలున్నాయని, రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.